సాక్షి తిరుపతి
గురువారం | 31 | అక్టోబర్ | 2024



హైవే పక్కనే దర్జాగా కబ్జా
నాయుడుపేట మండల బిరదవాడ సమీపంలో జాతీయ రహదారి పక్కనే రూ.కోట్ల విలువైన భూమి కబ్జాకు గురైంది. - 8లో



అభివృద్ధికి దిశానిర్దేశం
జిల్లా అభివృద్ధికి సంబంధించి వివిధ శాఖల అధికారులకు ఎంపీ గురుమూర్తి బుధవారం దిశానిర్దేశం చేశారు. - 8లో



1 నుంచి స్కిల్ సెన్సెస్
నవంబర్ 1వ తేదీ నుంచి స్కిల్ సెన్సెస్ చేపడుతున్నట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. ఈ మేరకు ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

డీఆర్‌ఓ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఆర్‌ఓ

తిరుపతి అర్బన్ : జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) నరసింహులు బుధవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం మర్యాదపూర్వకంగా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తామని తెలిపారు.

'పామ్' రాయితీలకు దరఖాస్తులు



దశరథరామిరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

తిరుపతి అర్బన్ : ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు రాయితీలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథ రామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నవంబర్ 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకునే వారికి మాత్రమే రాయితీలు ఉంటాయని వెల్లడించారు. ఈ మేరకు జిల్లాలో 24 మండలాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. హెక్టార్‌లో ఆయిల్ పామ్ సాగు చేపట్టిన రైతుకు రాయితీగా ఇండియాలోని మొక్కలు అయితే రూ.20వేలు, ఇతర దేశాల మొక్కలు అయితే రూ.29 వేల వరకు అందించనున్నట్లు వివరించారు. అలాగే హెక్టార్‌లో అంతర పంటల సాగుకు రూ.5వేలు, ఎరువులకు రూ.5వేలు రాయితీ మంజూరు చేస్తామని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఆయా మండలాల్లోని ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

బ్యాడ్మింటన్ టోర్నీ విజేత ఎస్వీయూ జట్టు



విన్నర్స్‌కు ట్రోఫీ అందిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ : అన్నమయ్య జిల్లా మదనపల్లె బీటీ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్ కళాశాల మెన్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఎస్వీయూ విద్యార్థులు విన్నర్స్‌గా నిలిచారు. అలాగే ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు రన్నర్స్‌గా సత్తా చాటారు. బుధవారం ఈ మేరకు గెలుపొందిన జట్లకు బీటీ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి, ఎస్వీయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి జ్ఞాపికలు, ధృవీకరణ పత్రాలు అందించి అభినందించారు.



పింఛన్.. ముంచెన్!



- కొనసాగుతున్న సామాజిక పెన్షన్ల తొలగింపు
- నాలుగు నెలల్లోనే 3,674 వరకు తగ్గింపు
- ప్రశ్నిస్తే.. లబ్ధిదారులు మృతిచెందారని అధికారుల బుకాయింపు
- ఇదెక్కడి 'మంచి ప్రభుత్వం' అంటున్న అవ్వాతాతలు

అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరతీసింది. గుట్టుగా అవ్వాతాతల పొట్టకొట్టేస్తోంది. ఎన్‌టీఆర్ సామాజిక భద్రతా పింఛన్‌లలో ప్రతి నెలా కోత విధిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 3,674 మంది లబ్ధిదారులను జాబితా నుంచి తొలగించేసింది. దీనిపై ప్రశ్నించిన వారికి సమాధానం చెప్పకుండా దాటవేత ధోరణిని అవలంభిస్తోంది. ఆవు చేలో మేస్తే.. దూడ గట్టున మేస్తుందా అన్న చందంగా.. అధికారులు సైతం సర్కారు పన్నాగంలో భాగస్వాములయ్యారు. పెన్షన్ పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నవారికి అన్యాయం చేస్తున్నారు.



తిరుపతి డీఆర్‌డీఏ కార్యాలయం

తిరుపతి అర్బన్ : ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ లబ్ధిదారుల సంఖ్య ప్రతి నెల తరిగిపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగు నెలల్లోనే 3,674 పింఛన్లకు కోత పెట్టింది. ఎందుకు తగ్గించారని ప్రశ్నిస్తే వారంతా మృతి చెందారని అధికారులు సమాధానం ఇవ్వడం విడ్డూరంగా ఉంది. తొలగించిన పెన్షనర్ల పేర్లు తెలియజేయాలని కోరితే తప్పించుకోనేందుకు యత్నించడం పలు అనుమానాలకు తావిస్తోంది. తమ వద్ద జాబితా లేదని, విజయవాడలోని డీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలోనే తిరుపతి జిల్లా పింఛన్ల తగ్గింపు జాబితా ఉందని చెప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

గత చరిత్ర పునరావృతం

సార్వత్రిక ఎన్నికల సమయంలో 45 ఏళ్ల వారికి సైతం పింఛన్ ఇస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటే ఎత్తడం లేదు. ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా జూన్, డిసెంబర్‌లో కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. ఏటా సుమారు 11 వేల మందికి లబ్ధి చేకూర్చేవారు. అయితే కూటమి సర్కార్ మాత్రం ఇప్పటి వరకు ఒక్క పింఛన్‌ను కూడా కొత్తగా మంజూరు చేయలేదు. జూన్‌లో దాదాపు 5,500 మంది పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం వారిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. డిసెంబర్‌లో మరో 5వేల మందికి పైగా దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు గత చరిత్రను పలువురు గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో ఆయన ఇదే తరహాలో పెన్షనర్లను తొలగించేవారు. ఎవరైనా లబ్ధిదారుడు మరణిస్తేనే మరొకరికి కొత్త పింఛన్ మంజూరు చేసేవారు. ఇప్పుడు కూడా అదే అదే పునరావృతమవుతోందని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా నిరుపేదల పొట్టగొట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదేం పాలన

కూటమి నేతలు ఇది మంచి ప్రభుత్వం అంటూ పది రోజులపాటు డబ్బా కొట్టుకుని ఇంటింటికీ వెళ్లి ఒక స్టిక్కర్‌ను అతికించి చేతులు దులుపుకున్నారు. ఎంత మేరకు ప్రజలకు ప్రయోజనం చేకూర్చుతున్నారో ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చేస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం చేయాల్సి ఉంది. అయితే ఆ మాట లేదు. పాఠశాలలు ప్రారంభించి ఐదు నెలలు గడుస్తున్న తల్లికి వందనం పథకానికి దిక్కు లేదు. నిరుద్యోగ భృతీ లేదు. ప్రతి నెలా మహిళలకు రూ.1,500 ఇస్తామన్న హామీ ఊసేలేదు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై ఎలాంటి ప్రకటన లేదు. ఇప్పటి వరకు సక్రమంగా ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. పైగా ఉన్న పథకాలకు సైతం తూట్లు పొడుస్తున్నారు.

జిల్లా సమాచారం

నెల	పెన్షన్ల సంఖ్య	తొలగించినవి
జూలై	2,69,162	
ఆగస్ట్	2,67,772	1,390
సెప్టెంబర్	2,67,089	683
అక్టోబర్	2,66,342	747
నవంబర్	2,65,488	854

మృతులను మాత్రమే తొలగించాం



పింఛన్ లబ్ధిదారులను తొలగించలేదు. మృతి చెందిన వారిని మాత్రమే జాబితా నుంచి తీసేశాం. ఈ నాలుగు నెలల్లో 3,674 మందిని తొలగించింది వాస్తవమే. అయితే వారంతా మృతులే. వారి పేర్లు, వివరాలు మావద్ద లేదు. విజయవాడలోని డీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలోనే ఉన్నాయి. కొత్త పింఛన్ల మంజూరుపై మాకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. అవి వస్తేనే వెల్లడించగలం. అప్పటి వేచి ఉండాల్సిందే.

– శోభన్‌బాబు, పీడీ, డీఆర్‌డీఏ

'సంస్మరణ'కు సంఘీభావం



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

చంద్రగిరి(తిరుచానూరు)/తిరుపతి క్రైమ్: : పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం తిరుచానూరులోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎస్పీ సుబ్బరాయుడు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను, విశిష్ట సేవలను స్మరించుకుంటూ రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. తిరుపతి, చంద్రగిరి, తిరుమల, రేణిగుంట, పుత్తూరు సబ్ డివిజన్ల పరిధిలోని పోలీసులు, ప్రజలు, విద్యార్థులు, డ్రైవర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి సంఘీభావం తెలపడం సంతోషంగా ఉందని చెప్పారు. సేకరించిన రక్తాన్ని తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, రుయా, స్విమ్స్, ఎన్టీఆర్ ట్రస్ట్‌కు అందజేస్తున్నట్లు వెల్లడించారు. రక్తదానం అంటే ప్రాణదానంతో సమానమని, రోడ్డు ప్రమాదాలు, మేజర్ సర్జరీలు వంటి అత్యవసర సమయాలలో ఎంతోమందికి ఉపయోగపడుతుందని వివరించారు. తిరుపతిలో 509 మంది రక్త దాతలు, అలాగే సబ్ డివిజన్లలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలలో 156 మంది కలిసి మొత్తం 765 యూనిట్ల రక్తం దానం చేశారన్నారు. నిజ జీవితంలో పోలీసులు నిరంతరం ప్రజారక్షణకే శ్రమిస్తుంటారని, వారికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, నాగభూషణ రావు, శ్రీనివాస రావు సాయుధ దళం డీఎస్పీలు గిరిధర్, వెంకటనారాయణ, ప్రసాద్, శ్రీలత, చిరంజీవి పాల్గొన్నారు.



జనసేన నాయకుడు తన అనుచరులతో వెళ్లి బెదిరించింది ఈ భవనం యజమానినే

కప్పం చెల్లిస్తేనే..భవనం కట్టనిస్తాం!

- తిరుపతిలో జనసేన నేత దౌర్జన్యం
- నిర్మాణ పనులు ఆపేయించిన వైనం
- ఆందోళనతో ఆస్పత్రి పాలైన భవన యజమాని

సాక్షి టాస్క్‌ఫోర్స్ : "ఏయ్.. ఎవరిదీ ఈ బిల్డింగ్? ఎవరిని అడిగి కడుతున్నారు? భవనం కట్టేటప్పుడు మా పర్మిషన్ తీసుకోవాలని తెలియదా? వెంటనే పనులు ఆపండి. బిల్డింగ్ నిర్మాణం జరగాలంటే.. నెలనెలా మాకు మామూళ్లు కట్టాలి. ఆ విషయం తేలేవరకు ఒక్క పని కూడా చేపట్టేందుకు వీలులేదు" అంటూ జనసేన నాయకుడు దౌర్జన్యానికి దిగాడు. వివరాలు.. తిరుపతి నగరంలోని 32వ వార్డులో ఓ ఉద్యోగి భవనం నిర్మించుకుంటున్నారు. ఇందుకోసం కార్పొరేషన్ అనుమతి కూడా తీసుకున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ శ్లాబ్ పూర్తి చేసి.. మొదటి అంతస్తు నిర్మాణ పనులు ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అనుచరుడు 35వ వార్డుకు చెందిన జనసేన జనరల్ సెక్రటరీ తన అనుచరులతో కలిసి భవన నిర్మాణం వద్దకు వెళ్లి బెదిరింపులకు దిగాడు. పనులు జరగాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాము కొత్తగా ఆఫీసు పెట్టామని, నిర్వహణ కోసం ప్రతి నెలా డబ్బులు పంపాలని హుకుం జారీ చేశారు. సాయంత్రం మా మనిషిని పంపుతాం వెంటనే డబ్బులు ఇచ్చి పంపాలని ఆదేశించారు. కొంతసేపటికే జనసేన నేత అనుచరుడు గణేష్ అనే వ్యక్తి వచ్చి మామూలు అడిగినట్లు భవన యజమాని తెలిపారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలి అని అడిగినందుకు.. భవన నిర్మాణ వీడియోలు తీసి హడావుడి చేశారన్నారు. నిర్మాణ సామగ్రిని ధ్వంసం చేశారని వాపోయారు. ఈ క్రమంలోనే ఆయన అస్వస్థతకు గురి కావడంతో కుటుంబీకులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎమ్మెల్యే కార్యాలయానికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి నేతల కుతకుత!

- టీటీడీ బోర్డులో చోటు కల్పించకపోవడంపై అసంతృప్తి
- తిరుపతిలోని యాదవులు, తిరుమలలోని బ్రాహ్మణులకు మొండిచేయి
- మరో హామీని గాలికి వదిలేసిన సీఎం చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో చోటు దక్కకపోవడంపై కూటమి నేతలు కుతకుతలాడిపోతున్నారు. మంత్రివర్గంలో తిరుపతి, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులకు స్థానం లేకపోవడంతో టీటీడీ బోర్డులో అయినా అవకాశం ఇస్తారని ఆశగా ఎదురుచూసి నేతల ఆశలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నీళ్లు చల్లేశారు. టీటీడీ పాలకమండలి సభ్యుడి పదవి తమకే అంటూ ప్రచారం చేసుకున్నవారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలిసి తమకు అన్యాయం చేశారని రగలిపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఐదునెలల తర్వాత బుధవారం టీటీడీ బోర్డుని ప్రకటించింది. అయితే ఈ బోర్డులో తాము ఉంటామని కూటమి నేతల్లో పలువురు నమ్మకంగా ఉన్నారు. అందులో మొదటి వరుసలో ఎన్టీఆర్ రాజు కుమారుడు శ్రీధర్‌వర్మ ఒకరు. ఎన్టీఆర్ హయాంలో రాజుకి అవకాశం దక్కింది. ఆ తర్వాత ఆ కుటుంబంలోని శ్రీధర్‌వర్మకు పాలకమండలి సభ్యుడు కావాలని ఆశపడ్డారు. ఈ విషయాన్ని పలుమార్లు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అలాగే టీటీడీ బోర్డు మాజీ సభ్యులు డాక్టర్ హరిప్రసాద్, ఓవీ రమణ, భానుప్రకాష్‌రెడ్డి సైతం ఆశవహుల్లో ఉన్నారు. ఈ మేరకు తమ పార్టీల అధినేతలకు సైతం పలుమార్లు విన్నవించారు. శ్రీకాళహస్తి నుంచి కోలా ఆనంద్ కూడా పాలకమండలిలో స్థానం కోసం ముమ్మరంగా ప్రయత్నించారు. ఇకపోతే తిరుపతి జిల్లాలో జనసేన కీలకమైన నాయకుల్లో ఒకరైనా కిరణ్‌రాయల్ కూడా పాలకమండలిలో చోటు దక్కుతుందని నమ్మకంతో ఉన్నారు. అయితే వీరెవ్వరికీ బోర్డులో స్థానం దక్కలేదు. ఈ క్రమంలోనే చిత్తూరు జిల్లా నుంచి పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డికి మంత్రి వర్గంలో స్థానం లభించకపోయినా టీటీడీ పాలకమండలిలో అవకాశం ఇస్తారని టీడీపీ నాయకులు ఎదురుచూశారు. పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన చల్లా రామచంద్రారెడ్డి, పుంగనూరుకే చెందిన రామచంద్రయాదవ్ సైతం టీటీడీ బోర్డులో స్థానం కోసం యత్నించారు.


మాట నిలబెట్టుకోని బాబు

తిరుమలలో పనిచేసే బ్రాహ్మణులు, తిరుపతికి చెందిన యాదవులకు టీటీడీ బోర్డులో అవకాశం కల్పిస్తామని గతంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం బోర్డు ఏర్పాటులో ఆ విషయాన్ని అసలు పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో ఆయా సామాజికవర్గాల వారు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకోలేదని మండిపడుతున్నారు.

భవిష్యత్ 'అపార్'ం!

జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా ఆధార్ తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. వన్ నేషన్– వన్ స్టూడెంట్ నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) నంబర్ కేటాయించనుంది. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో అపార్ నంబర్ కేటాయించి విద్యార్థికి సంబంధించిన సమస్త సమాచారం అందులో నిక్షిప్తం చేయనుంది. కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులకు ఈ నంబర్ కేటాయించనుంది. ఈ మేరకు జిల్లాలో ఈ ప్రక్రియ వేగవంతమైంది.

- వన్ నేషన్– వన్ స్టూడెంట్ లక్ష్యం
- ఎన్ఈపీలో భాగంగా విద్యార్థులకు అపార్ కార్డు
- 12 అంకెలతో జాతీయ స్థాయి గుర్తింపు ఐడీ
- తొలి దశలో 9 నుంచి ఇంటర్ విద్యార్థులకు జారీ
- త్వరలో కేజీ టూ పీజీ విద్యార్థులకు సైతం
- జిల్లాలో ప్రారంభమైన ప్రక్రియ



అపార్ మోడల్ కార్డ్

తిరుపతి సిటీ: కేంద్ర విద్యామంత్రిత్వశాఖ విద్యారంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. జాతీయ నూతన విద్యావిధానంలో (ఎన్ఈపీ) భాగంగా ప్రతి విద్యార్థికీ పూర్తి సమాచారంతో అపార్ పేరుతో డిజిటల్ లాకర్‌కు అనుసంధానం చేస్తూ పర్మినెంట్ గర్తింపు కార్డును అందించనుంది. ఇకపై అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) కీలక పాత్ర పోషించనుంది. ప్రతి విద్యార్థికీ ప్రత్యేకంగా ఒక నంబర్‌ను కేటాయించి.. అందులో సమగ్ర సమాచారాన్ని నిక్షిప్తం చేయనుంది. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో అపార్ నంబర్‌ను కేటాయించేందుకు జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీచేసింది. దీంతో తిరుపతి జిల్లాలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 2,25,225 మంది విద్యార్థుల అపార్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది.

విద్యార్థి భవిష్యత్‌కు అపార్ కీలకం

విద్యార్థి ఉన్నత చదువులకు, ఉపాధి, ఉద్యోగాలలో అపార్ కార్డు కీలకంగా మారనుంది. పుట్టిన తేదీ నుంచి విద్యార్థి పూర్తి వివరాలు, 12 అంకెలతో కూడిన ఐడీ, క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ కార్డు రూపంలో భద్రపరుస్తారు. విద్యార్థి చదువుకు సంబంధించిన మార్కుల జాబితా, వ్యక్తిగత సమాచారం, సాధించిన విజయాలు, క్రీడలలో సాధించిన ప్రతిభ, అవార్డులు, పురస్కారాలు ఎప్పటికప్పుడు అపార్‌లో నమోదవుతాయి. సంబంధింత విద్యార్థి సమాచారం తెలుసుకోవాలంటే క్యూర్ కోడ్ స్కాన్ చేస్తే బయోడేటా పూర్తిగా తెలుకోవచ్చు. ఉద్యోగాల భర్తీ, ఉపకార వేతనాలు, ఇంటర్వ్యూలు, ఉన్నత విద్య ప్రవేశాల సమయంలో ఇది ఎంతగానో ఉపయోగపడనుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థీ అపార్ కార్డు చేసుకోవాల్సి ఉంది.

తొలి దశలో 9 నుంచి ఇంటర్ వరకు


కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ అధికారులు తొలిదశలో 9, 10, ఇంటర్ విద్యార్థులకు అపార్ కార్డును అందించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించింది. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్లో విద్యార్థి పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్) నంబర్, వ్యాలిడిటీ ఆధార్ నంబర్ ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నూతన విధానంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ప్రతి పాఠశాలలోనూ తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కసారి కార్డు వచ్చిందంటే మార్పులకు అవకాశం ఉండకపోవడంతో విద్యార్థుల వివరాలు అక్షరం తప్పులేకుండా నమోదు చేస్తున్నారు. మలి దశలో కేజీ టూ పీజీ విద్యార్థులకు సైతం అపార్ అందించేందుకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

తిరుపతి జిల్లా వివరాలు

పాఠశాలలు	సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1,817	47,998
ప్రాథమికోన్నత	194	13,983
ఉన్నత	323	74,589
జూనియర్ కళాశాలలు	61	88,685

తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి

విద్యార్థుల వ్యక్తగత సమాచార గోప్యతపై అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అపార్ ఐడీ వివారలు ఆధీకృత వినియోగదారుల ద్వారా మాత్రమే అందుబాటులో ఉండేలా భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. 18 ఏళ్లలోపు పిల్లల అపార్ ఐడీ జనరేషన్ చేసేందుకు తల్లిదండ్రుల అనుమతి తీసుకుంటున్నారు.



జీవిత కాల ఐడీగా అపార్



అపార్ కార్డు ప్రతి విద్యార్థికి ఇక జీవిత కాల ఐడీగా పనిచేయనుంది. ఇందుకు సంబంధించి తల్లిదండ్రుల అనుమతులు తప్పక తీసుకోవాలని హెచ్ఎంలకు సూచించాం. కళాశాల ప్రిన్సిపాల్స్ సైతం ఒక్క అక్షరం తప్పులు దొర్లకుండా విద్యార్థి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగనుంది.

–శేఖర్, డీఈఓ, తిరుపతి జిల్లా

విద్యార్థులకు అపార్ కీలకం



మా అబ్బాయి ఇంజినీరింగ్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కళాశాలలో ఎంటెక్ అడ్మిషన్ కోసం వెళ్లినప్పుడు ధ్రువపత్రాల విషయంలో సమస్య ఏర్పడింది. మైగ్రేషన్ సర్టిఫికెట్ కావాలంటూ ఇబ్బంది పెట్టారు. తిరిగి ఎస్వీయూకు వెళ్లి సంబంధిత సర్టిఫికెట్ కోసం సుమారు వారం రోజుల పాటు తిరగాల్సి పరిస్థితి ఏర్పడింది. అపార్ కార్డు ఉంటే ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యేవి కావు.

–సుబ్రమణ్యం, విద్యార్థి తండ్రి, తిరుపతి

రిస్క్ తగ్గుతుంది



అపార్ ఎంతో ఉపయోగకరం. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైతే చాలు తల్లిదండ్రుల అవస్థలు వర్ణనాతీతం. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల దగ్గర రోజుల తరపడి తిరుగాల్సిన పరిస్థితి. అపార్‌తో అలాంటి ఇబ్బందులకు కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టిడం శుభపరిణామం.

–ప్రభావతి, టీచర్, తిరుపతి జిల్లా



అభివృద్ధికి దిశానిర్దేశం

- కలెక్టరేట్‌లో సమీక్షించిన ఎంపీ గురుమూర్తి
- జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం
- చైర్మన్, కో–చైర్మన్ హోదాలో హాజరైన తిరుపతి, చిత్తూరు ఎంపీలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మద్దిల గురుమూర్తి, చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

తిరుపతి అర్బన్ : జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఎంపీ గురుమూర్తి దిశానిర్దేశం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ హోదాలో ఎంపీ గురుమూర్తి, కో–చైర్మన్‌గా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు పరిహారంతో పాటు బీమా వర్తింపజేయాలని ఆదేశించారు. తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని కోరారు. రైతులకు సకాలంలో రాయితీపై విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్, ఫసల్ బీమా యోజనకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఇబ్బందులంటే నివేదిక ఇవ్వాలని కోరారు. పది లక్షల టన్నుల నాణ్యమైన చెరుకు అందుబాటులో ఉన్నప్పటికీ గాజులమండ్యం కో–ఆపరేటివ్ చెరుకు ఫ్యాక్టరీని మూతపడే ఉందని, వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. జగనన్న కాలనీల్లో పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. సత్యవేడు, నారాయణవణం, నాగలాపురం, సూళ్లూరుపేట, తడ, మండలాల్లో రేషన్ బియ్యం అక్రమంగా పక్క రాష్ట్రాల్లోకి తరలిస్తున్నారని, దీనిపై దృష్టి సారించి, స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొత్త రేషన్ కార్డుల మంజూరుపై దృష్టి సారించాలన్నారు. రాజకీయ,వ్యక్తిగత కక్షలతో రేషన్ డీలర్లను తొలగిస్తున్నారని, వాటికి అడ్డుకట్టవేయాలని స్పష్టం చేశారు. ఎంపీ నిధుల వినియోగంలో కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని మండిపడ్డారు. అర్హులైన వారికి పెన్షన్ మంజూరు చేయాలని సూచించారు. చిరుద్యోగులను రాజకీయ కారణాలతో వేధిస్తున్నారని, వాటిని వెంటనే అడ్డుకోవాలని ఆదేశించారు. వసతిగృహాల్లో విద్యార్థుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పీహెచ్‌సీలో ఆదివారం కూడా వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. తిరుపతిలో డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపరచాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్యకు సూచించారు. తాగునీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. తర్వాత సమావేశానికి వచ్చేప్పుడు అధికారులు పకడ్బందీగా అన్ని నివేదికలతో రావాలని ఆదేశించారు. అనంతరం చిత్తూరు ఎంపీ, కలెక్టర్ సైతం పలు సూచనలు చేశారు. సమావేశంలో నెల్లూరు జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జేసీ శుభం బన్సల్ పాల్గొన్నారు.

ఐ అండ్ పీఆర్ పక్షపాతం

ఐ అండ్ పీఆర్ అధికారులకు తమ పక్షపాత వైఖరిని బయటపెట్టుకున్నారు. పాలక పక్షంపై అభిమానం చాటుకున్నారు. సమావేశానికి సంబంధించి పత్రిక ప్రకటనలో ప్రోటోకాల్ ప్రకారం ముందుగా చైర్మన్ హోదాలో తిరుపతి ఎంపీ గురుమూర్తి ప్రసంగాన్ని పొందుపరచాల్సి ఉంటుంది. అయితే కో– చైర్మన్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ప్రసంగాన్ని ముందు ప్రచురించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దీనిపై పలువురు విలేకర్లు ప్రశ్నించగా అధికారులు మళ్లీ మార్పు చేసి ప్రెస్‌నోట్ పంపించడం గమనార్హం.

రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొట్టిన లారీ...
హెడ్ కానిస్టేబుల్ మృతి


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ

తిరుపతి రూరల్: జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వేగంగా దూసుకొచ్చిన ఓ మినీలారీ... బైక్‌ను ఢీకొట్టడంతో హెడ్ కానిస్టేబుల్ మృతిచెందారు. ఈ ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై వకుళమాత ఆలయం సమీపంలో బుధవారం జరిగింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు... రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న లక్ష్మీనారాయణ (51) తిరుపతిలోని ఎస్ఎల్ నగర్‌లో తన కుటుంబంతో కలిసి ఉంటున్నారు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం పాకాల కోర్టుకు వెళ్లి తిరిగి తిరుపతికి వస్తుండగా... జాతీయ రహదారిపై వకుళమాత ఆలయం వద్ద రాంగ్ రూట్‌లో ఎదురుగా టమాటా ఖాళీ బాక్స్‌లతో వస్తున్న మినీలారీ ఢీకొట్టింది. తలకు, కాలికి తీవ్ర గాయాలైన లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతిచెందారు. నిర్లక్ష్యంగా మినీలారీని నడిపి లక్ష్మీనారాయణ మృతికి కారణమైన డ్రైవర్ దార మోహన్ పారిపోయాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతిచెందిన లక్ష్మీనారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

యూత్ వింగ్ స్పోక్స్‌పర్సన్‌గా భార్గవ్ సాయి



తిరుపతి సిటీ : హ్యూమన్ రైట్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్ఆర్‌సీఐ) ఏపీ యూత్ వింగ్ స్పోక్స్ పర్సన్‌గా ఎస్వీ భార్గవ్ సాయిని నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు చెన్నూపాటి శ్రీకాంత్, సెక్రటరీ నరసింహారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. భార్గవ్ సాయి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

రేపటి నుంచి పెన్షన్ల పంపిణీ

తిరుపతి అర్బన్ : ఎన్టీఆర్ సామాజిక భద్రతా పెన్షన్లను నవంబర్ 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 2,65,488 మందికి పెన్షన్ అందించనున్నట్లు వెల్లడించారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిల్లకూరు : మండలంలోని వరగలిలో ఈ నెల 7వ తేదీన హత్యకు గురైన బాలుడి కేసులో నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. గూడూరు డీఎస్పీ రమణకుమార్ వివరాలు వెల్లడించారు. మండలంలోని వరగలికి చెందిన కతారి రమేష్‌కు కొక్కుపాడు గ్రామానికి చెందిన సంధ్యతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి కుమారుడు లాసిక్ (11)వాకాడులోని గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. బాలుడు తల్లి సంధ్యకు పెళ్లి ముందు నుంచే కొక్కుపాడుకు చెందిన అనిల్‌కుమార్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో తనతో వచ్చేయాలని సంధ్యపై అనిల్‌కుమార్ ఒత్తిడి చేసేవాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో కొడుకు లాసిక్‌ను అడ్డు తప్పిస్తే సంధ్య తనతో వచ్చేస్తుందని భావించాడు. దీంతో వరగలికి చెందిన చరణ్ అనే యువకుడితో కలసి లాసిక్‌ను కండలేరు క్రీక్‌లో తోసి చంపేశాడు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

హైవే పక్కనే దర్జాగా కబ్జా

- రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ
- అడ్డుకున్న బిరదవాడ గ్రామస్తులు


ఆక్రమణదారులు చదును చేయించిన ప్రభుత్వ భూమి

నాయుడుపేటటౌన్ : మండలంలోని బిరదవాడ సమీపంలో జాతీయ రహదారి పక్కనే రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమార్కులు దర్జాగా కబ్జా చేసేశారు. టీడీపీ నేతల అండతో భూమి చదును చేసి హద్దురాళ్ల ఏర్పాటు చేసేందుకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. వివరాలు.. హైవే పక్కన సర్వే నంబర్ 100–3, 105లో 1.6 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ ఎకరా సుమారు రూ.3కోట్లకు పైగా చేస్తోంది. దీంతో ఈ భూమిపై కబ్జారాయుళ్ల కళ్లు పడ్డాయి. గతంలో ఓ సారి ఈ భూమిని ఆక్రమించేందుకు కొందరు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల కిత్రం టీడీపీ నేతల సహకారంతో కొంతమంది భూమిని చదును చేసేందుకు చర్యలు చేపట్టారు. గ్రామస్తులు అడ్డుకోబోతే పోలీసుల సాయంతో బెదిరింపులకు దిగారు. ఈ మేరకు బిరదవాడ గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. భూ ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూమిని గ్రామంలోని పేదలకు పంపిణీ చేయాలని పేర్కొన్నారు.

లిడ్‌క్యాప్ భూముల పరిశీలన


మాట్లాడుతున్న మాణిక్యరావు

చంద్రగిరి(తిరుచానూరు) : రేణిగుంట రోడ్డులోని లిడ్‌క్యాప్ భూములను బుధవారం లిడ్‌క్యాప్ చైర్మన్ మాణిక్యరావు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ మూతపడిన పరిశ్రమలను సందర్శించారు. అనంతరం లిడ్‌క్యాప్ చైర్మన్ మాట్లాడుతూ 1973 అక్టోబర్ 4 మాదిగల అభివృద్ధి కోసం లిడ్‌క్యాప్ పరిశ్రమలు ఏర్పాటు చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రేణిగుంట రోడ్డులో స్థలాలను కేటాయించినట్లు వెల్లడించారు. ఇక్కడే ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, ఉత్పత్తి ప్రారంభించినట్లు వివరించారు. గత 10 పదేళ్లలో లిడ్‌క్యాప్‌కు సంబంధించిన భూములను నాశనం చేశారని తెలిపారు. ఆయా భూములను తిరిగి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సర్వే చేయించి కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.

1 నుంచి స్కిల్ సెన్సెస్


మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్ : జిల్లాలో నవంబర్ 1వ తేదీ నుంచి స్కిల్ సెన్సెస్ చేపట్టాలని జేసీ శుభం బన్సల్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సెన్సెస్ చేపట్టనున్న ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. జేసీ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోని వ్యక్తుల విద్యార్హత, ఉద్యోగ వివరాలను సేకరించాలని సూచించారు. ఒక్కో సచివాలయ పరిధిలో ఒక్కో వ్యక్తి సెన్సెస్ చేపట్టాలని చెప్పారు. జిల్లాలో 175 మంది ఉద్యోగులను ఇందుకోసం నియమించినట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి వెంకటరమణ, డీపీఓ సుశీలాదేవి, పర్యవేక్షణ అధికారి శ్యామ్మోహన్, ఏపీఎస్ఎస్‌డీసీ వెంకట్రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం, గణేష్ పాల్గొన్నారు.

వ్యాస రచనలో బ్లూమింగ్ బడ్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో అతిథులు

చంద్రగిరి : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన జాతీయ స్థాయి వ్యాస రచన పోటీలలో బ్లూమింగ్ బడ్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. బుధవారం ఈ మేరకు విద్యార్థులకు విజిలెన్స్ సెల్ ఇన్‌చార్జి గిరిధర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ మహేష్ కుమార్, ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ సురేష్ బాబు బహుమతులు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ హితేంద్రనాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

4 నుంచి వస్త్రాల ఈ-వేలం

తిరుపతి(అలిపిరి): టీటీడీ పరిధిలోని ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన 358 లాట్ల వస్త్రాలను నవంబరు 4 నుంచి 11వ తేదీ వరకు ఈ-వేలం వేయనున్నట్లు అధికారులు తెలిపారు. వివరాలకు 0877–2264429, www.tirumala.org/ www.konugolu.ap.govt.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.